త్కృతి పల్కులన్ సమర్పించు భాష
భాషలోక పది తెలిసిన ప్రభువుచూచి
భాషయననిద్దియని చెప్పబడిన భాష
తవర ఛందస్సులోని యందమ్ము వడక
తీర్చి చూపించినట్టిది తెలుగు భాష
వృత్తులు పాకముల్ రీతులు శైలులు
లావణ్య మొప్పెడు లలిత భాష
ఎద్ది సంభవమౌనొ అద్ది సంధానించి
ఉచితత్వమున్ గూర్చ నొదుగు భాష
ఎన్నియొయ్యారంబులేని పోవగజేసి
నడిపింవగలయట్టి గడుసు భాష
పాలించి దక్షిణాపథమెల్ల నొకనాడు
ప్రభుత నిరూపించు రాజభాష
అల్ల భాషయొక్కనధికత్వమంతయు
శక్తి నెరపగలుగు జనుల మీద
అన్ని కాలములను నాధారపడి యుండు
తెలుగు భాషయన్న దివ్యభాష"

అమర భాషను బోలిన భాష తెలుగు భాషయని–వేదముల్ సంస్కృత నాదముల్ చేసిన తెలుగువాడే చేయవలయు ననగ.. యిలా ఎంతో మధురంగా విశ్వనాథ తెల్పారు. ఆంధ్ర భాషా యోషని త్రికరణశుద్ధిగా గొలిచారు. తల్లి ఆంధ్రి,తల్లి తల్లిగీర్వాణి ఆదరానుగ్రహపాత్రుడై తెనుగు కవితలో గోస్తనీ ఫలములను, పుష్పాసవాన్ని, ఖండ చక్కెరను ఆంధ్రులకు ప్రసాదించి అమరులైనారు. ది.10–9–1895న కృష్ణా జిల్లా నందమూరులో జన్మించి ది. 18–10–1976 న విజయవాడలో నాకవాసులైనారు. మహాకవి శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి మహోపాధ్యాయుని శిష్య కోటిలోని వారైన విశ్వనాథ గురుపాదునివలె ఎన్నెన్నో సత్కారాలు, బిరుదులు, ఆంధ్రాస్థానకవి స్థానము జ్ఞాన పీఠం వారి బహూకృతిని పొంది ఆధునికాంధ్ర ప్రదేశ్‌లో కవి మూర్ధన్యునిగా చిరయశస్సును ఆర్జించినారు. తెలుగు ప్రజలు మనినంత కాలము తెలుగు ప్రజల హృదయ పేటికలో స్వర్ణాసనాదిష్ఠులై చిరంజీవిగా నుందురు.

ఆంధ్రుల ఇలవేల్పు గాథని 'రామాయణ కల్పవృక్షము'గా రచించి చిరస్మరణీయులైనారు.

●

# య్యో – హిషిఖెయ్

ఉరిఖిలా నీగ్రో నాయకుడు. అతనికి నాకు మొదటిసారి పరిచయం చిత్రముగా నైనది. కివుసరస్సు దగ్గర గుమ్మైన చెట్లపైని మాటుపెట్టి పులికై నేనెదురు చూచుచుంటిని. అది మసక వేళ. అనేక వన మృగములు దప్పికకై వచ్చుచు బోవుచున్నవి. రెండు మూడాడు సింహములు వచ్చినవి. నేను పులినే కొట్టవలెనని యాగితిని. ఇంతలో నా వెనుక భయంకరమైన ధ్వనియైనది. నేను వెనుదిరిగి చూచితిని. ఉత్తరాఫ్రికాలో గనిపించు బార్బరీవానర మొకటి తీవ్రమైన యమ్ముచేత గొట్టబడి తత్క్షణమే పడిపోవుచుండెను. చెట్టు క్రిందికి జూచితిని. తలలో నీకలు, కట్టిన నాకు బట్టలు, 'గాఢోరస్కుడు నొక నీగ్రో వేటగాడు పరుగెత్తుకుని వచ్చుచుండెను. అతడు వచ్చి నన్ను దిగి రమ్మని సంజ్ఞ చేసెను. నేను దిగి వచ్చితిని. నాకు గొంచెము కొంచెము నీగ్రోబాష తెలియును. అతనికి గొంచెము కొంచెము ఫ్రెంచి భాష తెలియును. బార్బరీ వానరము నన్ను జూచి నా మీద దుముకబోవు చున్నదనియు, నందుచేత నతడు దానిని విషలిప్త బాణముతో జంపెననియు నిటువంటి చోట్ల మాటు పెట్టరాదనియు, బాబూన్, గిబ్బన్ మొదలైన వానరములు మనుజుల నూరకే యెదిరించుననియు, వృక్షములమీద గూడ మనిసి సురక్షితుడు కాడనియు జెప్పెను. మేమిర్వురము కలిసిపోతిమి., నాటినుండి యురిఖిలాకును నాకును మైత్రి. ఉరిఖిలా విచిత్ర పురుషుడు. నీగ్రో పల్లెలలో నడివిలో వారి నీగ్రో జాతి వలెనే వేసము ధరించి యుండును. పట్టణములలో బెల్జియనులవలె వేసము ధరించి మంచి నాగరకునివలె సంచరించును.

నేను యామ్ముయా పట్టణమున నివసించుచుంటిని. యాముయా అరువిమి నదియొడ్డున నున్నది. అరువిమి కాంగో నదికి శాఖానది. ఉరిఖిలా పట్టణమునకు వచ్చినపుడెల్ల నాతో గలసి మాటాడును. ఒకనాడు సాయంకాలము మేమిర్వురము నరువిమి యొడ్డున నడచుచుంటిమి. కొంత దూరము పోయిన తరువాత నొక పెద్ద దిబ్బయొద్ద నిలుచుండి యురిఖిలా రెండు చేతులు జోడించి యెదుటొమ్మున ఫాలమున శిరస్సున నద్దుకొని మోకరించి వంగి, శిరసు నేల నానెను. నే 'నేమి?'టని యడిగితిని. అతడు నేత్రములయందు సునిశితత్వము భాసింపగా 'య్యోర్రిషిఖెయ్–య్యోర్రిషిఖెయ్' అన్నాడు. అతడన్నది నాకు దెలియలేదు. నేనప్పడడిగినను నతడు. చెప్పినట్లు లేదు. అతడు దీర్ఘాలోచనపరుడై తల వంచుకుని రెండు చేతులు వీపు వెనక గలిపికట్టి నడచుచుండెను. కొంత దూరము పోయిన తరువాత నతడు నా వంక దిరిగి "య్యోర్రిషిఖెయ్ నెఱుగవా?" యనెను. నే నెఱుగ నంటిని. అతడు "హిషిఖెయ్ గొప్ప కవి. మా భాషలో నతడు వ్రాసిన గీతములు చాలా మున్నవి. అతండడవి పిట్ట. వాగులోని చేప. కాంగో బిడ్డ!" అనెను.

నేను నీగ్రో భాషలో గొన్ని మధురములైన గీతములున్నవని యెఱుగుదును. నీగ్రోల గొంతులలో మహా మాధుర్యమున్నది. వారి కొన్ని పాటలు వారు పాడుచుండగా వారి శరీరముల నైల్యము, వారి మొగముల యందలి వికారము–మున్నవా, లేవా యనిపించు చుండును. నిజమునకు నీగ్రోవారి సంగీత శక్తివలన యూరపు దేశపు సంగీతమెంత వృద్ధిపొందినది! ఉరిఖిలా యిట్లని చెప్పెను. "హిషిఖెయ్ మీ బెల్జియనుల నాగరికత గిట్టనివాడు. అతడు మొదటి నుండియు దన గీతములయందు మీ తెల్లవారి మార్గములు నిరసించు చుండెను. హిషిఖెయ్ నావలె మోటువాడు కాడు. అతడు ఫ్రెంచి భాష వ్రాయను, చదువను గలడు. అతడు తన గీతములు ఫ్రెంచి లిపిలో వ్రాసి, ఫ్రెంచి భాషలో వాని కర్థము వ్రాసి పత్రికలలో బ్రకటించు చుండెను. అతని గీతములు న్యాంగ్వే, న్యూ ఆంట్ వర్పు, లొయాంగో మొదలైన పెద్ద పట్టణములలోగూడ జదువుచుండిరి. ప్యారీ నగరములో నతని గీతములయందు గొప్ప సానుభూతి కలిగెను.

"కాని కాంగో దేశమున మిషనరీలకు, నిచ్చటి పాలకులకు నతని ప్రబోధము గిట్టినది కాదు". నేను 'నీ కతని గీతము లేవైన వచ్చునా' యని యడిగితిని. అతడు 'వచ్చు' నని తల యూపెను. నే 'నొకటి పాడు' మంటిని. అతడు తన గొంతు మంచిది కాదనియు, దన నోటబడి హిషిఖెయ్ మధుర గీతములు పాడైపోవచ్చుననియు జెప్పి యిట్లనెను. "కివు సరస్సుమీద కిస్పాలికాయను నొక సన్నని పిట్ట యెగురుచుండును. దాని కూత మిక్కిలి సన్ననై యది యొక విచిత్రముగ నుండును. కిస్పాలికా మఱియొక సరస్సుమీద నెగురదు. ఇంకొకచోట నుండదు. ఈ ఇటురీ' ( అరువిమి నది కింకొక పేరు) నది నరుగుల పైని సన్నగా నుండి యొక కొండ లోయలో నొక రాతి బెజ్జమునుండి జారిపడును. ఆ పడునప్పడు క్రిందనున్న చెట్ల కొమ్మలపై బడుచుండును. ఆ పడునప్పడొక సన్నని ధ్వని కలుగును. కిస్పాలికా కూత యా ఇటురీయాకులమీదబడు ధ్వనివలె నుండును.

కివుపై కిసాలికా,
కివుపై కిసాలికా,
ఇటురి ఆకులపైన
చిటిలిపడు కిస్కాలికా
ఫ్రాంసుల తుపాకికై
ప్రాణముల వద లెదవో
కివు నీట నీ శవము
కువకువలు సేయునో
కివుమీది కిసాలికా

# విశ్వనాథ సత్యనారాయణ

కివుపైని కిసా లికా
నీవు కివు కలపెదవు.
నేను కివు కలపెదను
మన తియ్యనగు పాట పోవునా?
కివుమీది కిసాలికా
కివుపైని కిసా లికా
ఖటురి జొంపము మీద నవ్వదుల
నీ నా మధురగీతి
విలిచె యుండును తెమ్ము
చిటిలినదు
కివుమీది కిసాలికా
కివుపైని కిసా లికా—

ఉరిఖిలా కంటితుదలయందు సన్నని నీటి బిందువులు కూడెను. అతడొక తన్మయత్వ స్థితిలో నుండెను. నేనతని బుజముపై జేయి వైచి 'ఉరిఖిలా' యంటిని. అతడదరిపడెను. నేను "హిషిఖెయ్ తరువాతి కథ యేమి?" టని యడిగితిని. ఉరిఖిలా మఱల జెప్ప నారంభించెను.

"హిషిఖెయ్ దేవుడు. కాంగోనది యవతార మెత్తినమూర్తి. అతనిని వశింపజేయుట యెట్లా యని తక్కిన వారందఱకు బుట్టెను. అందులో మా నీగ్రోలును జాలమంది యుండిరి. యామయాకు గ్రొత్త గవర్నరు వచ్చెను. ఆ రోజున హిషిఖెయ్ని మాట్లాడవలసినదని బలవంత పెట్టిరి. హిషిఖెయ్ మాట్లాడెను. అతడు వ్రాసిన కీర్తనలు కొన్ని పాడెను. వాని కర్థములు చెప్పెను. జన మెల్లరు తుపాకి వేసినట్లుండిరి. ఆనాడు హిషిఖెయ్ కాంగో దేవతవలె మహా భయంకరుడయ్యెను. పడవలను దలక్రిందులు చేయు కాంగో నదివలె నతడందఱి మనస్సులను దలక్రిందులు చేసెను. ఉన్నత ప్రదేశముల నుండి క్రిందికి లంఘించు కాంగో పాతములవలె హిషిఖెయ్ అల్పభావములమీదికి లంఘించెను. అతడు మాటాడినంతసేపెవ్వరును గదలలేదు. అందఱు దిగ్భ్రాంతియో యానందమో యనుభవించుచుండిరి. నా డెవరిదారిని వారింటికి బోయిరి. మఱునాడూరిలో గలకలము బయలుదేరెను. ఒకడు హిషిఖెయ్ గర్వియని, మఱొకడు హిషిఖెయ్ రాజద్రోహి యని, యింకొకడు హిషిఖెయ్ గవర్నరును నిందించెనని, వేఱొకడు హిషిఖెయ్ క్రైస్తవ మతమును దిట్టిపోసెనని నోటికొక మాటగా జెలరేగిరి. నిజమునకు హిషిఖెయ్ ఆనాడు తన పద్యములను జదివెను. వాని కర్థములు చెప్పెను. గవర్నరును బొగడెను. నీగ్రో కవితాశక్తిని మెచ్చుకొనెను. అతడు చేసిన దింత మాత్రమే! హిషిఖెయ్ గొప్పవాడని, నీగ్రోజాతి సంప్రదాయముల ననుసరించువాడని, హిషిఖెయ్ కవితాశక్తి ముందు తామందఱు నిలువ జాలమని, హిషిఖెయ్ మీద గత్తికట్టి క్రైస్తవులైన నీగ్రోలును పాలకులయందలి మిషనరీలును హిషిఖెయ్ని పత్రికలలో దూషించిరి. ప్రతి పత్రికలోనను దొంగ హిషిఖెయ్, విప్లవకారుడు హిషిఖెయ్ అని వ్రాయ మొదల్లుపెట్టిరి. హిషి



ఖెయ్ వీనికి వేనికిని సమాధానములు వ్రాయలేదు హిషిఖెయ్‌మీద పెద్ద కేసు పెట్టిరి. తర్వాత నెలనాళ్ళకు హిషిఖెయ్‌ని పట్టుకొనుటకు రాజభటులు వచ్చిరి. హిషిఖెయ్ తానప్పుడొక పాట పాడెను. ఆ పాటలోని యర్థమిది.

ఒక కట్టెల వాడడవిలో జెట్టు నఱకుచుండును. మఱొక చెట్టుకొమ్మ యతని తలమీద రెమ్మలానించి గాలి విసరుచుండెను. అతనికి చీదరయెక్కి విసుగుకొని యా కొమ్మను నఱికివేసెను.

"అతనిని రెండు మాసములు ఖైదులో నుంచిరి. . తరువాత జామీను మీద విడుదల చేసిరి. మా దేశములో ఖైదీలనగా మీ రెఱుగుదురుకదా! ఖైదులో నుండి బయటకు వచ్చిన తరువాత హిషిఖెయ్ అస్థిపంజరమైపోయెను. అతనికి క్షయవ్యాధి కలిగెను. అతడు ప్రతి దినము సాయంకాలమున నెత్తురు గ్రక్కుకొనుచుండెను. అతడు రెండు నెలలు తీసికొని యొకనాడు చనిపోయెను. చివరి దినములలో నతడు వ్రాసిన గీతములు మా జాతి నంతయు నుద్ధరించు చున్న"వని యురిఖిలా కన్నులు పెద్దవి చేసి ఇటురీ నీటి మీద జూచుచుండెను. నేను "ఉరిఖిలా! హిషిఖెయ్ కవిత్వము నాకు మఱియు వినవలెనని యున్నది. అతడు చివరి రోజులలో వ్రాసె నంటివే. అది యొక గీతము నుపాడగలవా" యంటిని.

ఉరిఖిలా కన్నులలోనికి నీళ్ళు వచ్చెను.

"ఇటురి, ఇటురి
ఒత్తిడి పొందకోయ్
నెత్తురు గ్రక్కకోయ్
ఇటురి, ఇటురి.
కొండ ఖైదును వదలి
పిండు నీరము ప్రిదిలి
ఇటురి, ఇటురి
నా పాటలో గలిసి
నాట్యమాడిన ఇటురి
ఒత్తిడి పొందకోయ్
నెత్తురు గ్రక్కకోయ్
ఇటురి ఇటురి.

ఈ పాట యతడొకనాడు సాయంవేళ నెత్తురు గ్రక్కుకొని ఇటురీ నదివంక జూచుచు గానము చేసెను." నేను మనస్సులో "హిషిఖెయ్ యెంత సుకుమారకవి!" యనుకొంటిని. ఉరిఖిలా మఱల నిట్లు చెప్పెను.


# వారం వారం వాల్మీకం



## త్వరలో కొత్త శీర్షిక


"ఇందాక నేను నిలుచుండి పూజ చేసినచోట హిషిఖెయ్‌ని తగులబెట్టినాము. ఆ దారివెంట బోవుచున్నప్పుడు నీగ్రోయైన ప్రతివాడును హిషిఖెయ్ యందు దన గౌరవము ప్రకటించి పోవలయును. హిషిఖెయ్ శరీరము మాత్రము మట్టిలో గలసిపోయినది. అతనియాత్మ కాంగోనదిలో బోయి మఱల గలసికొన్నది.

హిషిఖెయ్ చనిపోయిన తరువాత నీగ్రో జాతి మీద పాలకు లెక్కువ పగ సాధింప నారంభించిరి. మా పూజలు మా యాచారములు సర్వమునెడల విరోధభావ మెక్కువైనది. హిషిఖెయ్ అన్నచో ద్వేషము వెల్లడించిన మావారి కతని గొప్పదనమిప్పుడు తెలియుచున్నది. హిషిఖెయ్ కాంగోనది మీద నొక పాట వ్రాసెను. ఆ పాట యిప్పుడు ప్రతి నీగ్రోయును పరుండకముందొక మారు పాడుకొనిగాని నిదురపోడు."

నేనా పాట పాడుమంటిని.

"మెఱికలపై దూకే కాంగో
మెట్టలపై నుఱికే కాంగో
రాళులపై కదలే కాంగో
బుడగలుగా కట్టే కాంగో
నల్లని దేహపు కాంగో
తెల్లని బుడగల కాంగో
పడవలు విఱిచే కాంగో
కమ్మని పాటల కాంగో
జిమ్మను చలి కల కాంగో
నీగ్రో కాంగో, నీగ్రో కాంగో
చావని కాంగో చావని కాంగో
నల్లని కాంగో, నల్లని కాంగో
మెట్టల దూకే కాంగో
మెఱికల ఉఱికే కాంగో"

నేనీ విచిత్రమైన కవితా ఫక్కిలో గల యొక విచిత్రమైన వ్యంగ్యభావమును జూచి యాశ్చర్యపోయితిని. ఉరిఖిలాయును నేనును బయలుదేరితిమి. ఉరిఖిలా తన పల్లెటూరికి వన్ను రమ్మని యాహ్వానము చేసెను. ఇరువురము పోవుచుంటిమి. అడవిలోబడి నడచుచుండగా నొకరొకరము మాటాడుకొనలేదు. కొంత దూరం పోయిన తరువాత జీకటి పడినది. సూర్యాస్తమయము కాకముందే యడవిలో జీకట్లు బలిసినవి. ఉరిఖిలా పక్కనున్నంత వరకు నా కడవి జంతువులవలన భయము లేదు. చీకట్లు బాగుగా మునరినవి. ఉరిఖిలా పల్లె మఱి రెండు మైళ్ళు దూర మున్నది. దారిలో నొక చిన్న చెఱువున్నది. దానిపై నొక పిట్ట సన్నని కూత కూసినది. ఆ ధ్వని వినినంతనే ఉరిఖిలా

"కివు పై కిసొలికా
కివు పై కిసొలికా
ఉరిరి కిఱు కొరితె
కుయ్ ఖెలితె కిసొలికా"

అని గంతులు వేయనారంభించెను. ఉరిఖిలాకు డెబ్బది యైదేండ్లు వయసుండవచ్చును. అతడు లేడిపిల్లవలె చెంగు చెంగున దూక నారంభించెను. నే నతని నందుకొనలేకపోతిని. నేను దూరమునుండి యురిఖిలాయని కేకపెట్టి పిలిచితిని. అతడు నా యొద్దకు మఱల దుముకుచు వచ్చి పగలబడి నవ్వెను. చేయి యాకాశము వంక జూపించి యొక యీలవేసి 'కివు ఖై కిసొలికా కివుఖై కిసొలికా' యని యఱచెను.

అతని పల్లెకు కాలిత్రోవ దూరము. దట్టమైన యడవిలో నుండి దగ్గఱ త్రోవ యున్నది. అతడా త్రోవ తీసెను. కొంత దూరము పోవునరికి బొంయి మని పెద్ద ధ్వని వినిపించెను. ఒక వందమంది జనము పెద్దగా నఱచుచుండిరి. ఉరిఖిలా నది యేమిటని యడిగితిని. అతడిట్లు చెప్పెను. అచటికి దగ్గఱలో ఇటురీ నదిలో గలియు నొక పెద్ద వాగుండెను. అది యా సమీపమున బెద్ద తటాకము కట్టి మిక్కిలి లోతుగా నుండును. అందు మొసళ్ళు, నీటి గుఱ్ఱములు నివసించుచుండును. నీటి గుఱ్ఱమును వేటాడుట మిక్కిలి భయంకరమైన విషయము. నీగ్రోజాతి వారుచ్చులుపోసి పొదల వెనుక దాగియుండి యా యుచ్చులు నీటి గుఱ్ఱము కాళులకు దగిలించి బిగించి, దానిని వెలికిల ద్రోసి వలలలో దానిని సంగ్రహింతురు. అది చెదరిపోయెనా నీగ్రోల నందఱను విఱుగ ద్రొక్కును. దాని దీర్ఘ దంష్ట్రల నడుమ కనబడిన నమలి వేయును. దానిని వేటాడుట మహా కార్యము. ఉరిఖిలా తన పల్లెవారు నీటి గుఱ్ఱమును బట్టుకొని యుండిరని చెప్పెను. నేనది చూడవలయునంటిని. మేమిర్వుర మచ్చటికి బోతిమి. వంద కాగడాల వెలుగులో వెల్లకిల పడి చావు బ్రతుకుల మధ్యనున్న యా మహా జంతువు పడియుండెను. అన్ని వైపుల వలలు పట్టుకొన్నవారు, దాని కాళులకు బిగించిన పగ్గములు పట్టుకొన్న వారు నా జంతువును గదలకుండ జేయుచుండిరి.

రాత్రి రెండు జాములకు ఉరిఖిలా పల్లె చేరితిమి. రాతిరి నిదురబోవుచు ఉరిఖిలా హిషిఖెయ్ వ్రాసిన కాంగో పాట పాడి నిదురించెను.